# సాక్షి



మెట్రో రెండోదశ ప్రాజెక్టుపై జాతీయ రహదారుల సంస్థ, హెచ్ఏఎంఎల్ రెండురోజుల సంయుక్త పరిశీలన..

# పటాన్‌చెరు రూట్‌లో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్

## గంగారం వద్ద 1.2 కిలోమీటర్ల వరకు.. జాతీయ రహదారుల సంస్థకు ప్రతిపాదించిన 'మెట్రో'

**సాక్షి, హైదరాబాద్**

→ మెట్రో రెండోదశ ప్రాజెక్టులో భాగంగా మియాపూర్–పటాన్‌చెరు కారిడార్‌లో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ రానుంది. ఈ మేరకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) ప్రతిపాదించింది. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు సుమారు 13 కిలోమీటర్ల మెట్రో కారిడార్ నిర్మాణంలో బీహెచ్ఈఎల్ జంక్షన్ మినహా చాలావరకు రోడ్డు మధ్యలోనే (సెంట్రల్ మీడియన్) మెట్రో వయాడక్ట్(ట్రాక్) నిర్మించనున్నారు. ఈ మార్గంలో మదీనాగూడ ప్రాంతంలోని గంగారం వద్ద 1.2 కిలోమీటర్ల వరకు ఫ్లై ఓవర్ నిర్మించనున్నట్టు జాతీయ రహదారుల సంస్థ ప్రతిపాదించింది. అయితే ఇక్కడ మెట్రో వయాడక్ట్‌తో కూడిన డబుల్ డెక్కర్ ఫ్లైవర్ నిర్మించాలని హెచ్ఏఎంఎల్ భావిస్తోంది. హైదరాబాద్ మెట్రోరైల్, నేషనల్ హైవేస్ అథారిటీ కలిసి సంయుక్తంగా డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మిస్తే బాగుంటుందని మెట్రోరైల్ అధికారులు భావిస్తున్నారు. దీనిపై ప్రణాళికలు సిద్ధం చేసి నేషనల్ హైవేస్‌కు అందజేయనున్నారు. మెట్రో రెండోదశలో వివిధ రూట్‌లలో నిర్మించనున్న కారిడార్‌లపై జాతీయరహదారుల సంస్థ అధికారులు, మెట్రో రైల్ అధికారులు రెండురోజులు సంయుక్త తనిఖీలు నిర్వహించారు. మియాపూర్–పటాన్‌చెరు తోపాటు, ఎల్‌బీనగర్–హయత్‌నగర్, మైలార్‌దేవ్‌పల్లి–ఆరాంఘర్–హైకోర్టు రూట్‌లను పరిశీలించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ మెట్రో భవన్‌లో రెండు సంస్థలకు చెందిన అధికారు లు, మెట్రో రెండోదశ కన్సల్టెన్సీ సిస్ట్రాకు చెందిన ప్రతినిధులతో హెఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి సమావేశమయ్యారు. వారితో ప్రతిపాదిత మెట్రో కారిడార్లపై సమీక్షించారు.

### కింద రోడ్డు.. పైన మెట్రో

→ గంగారం వద్ద ప్రస్తుతం ఉన్న 1.2 కిలోమీటర్ల రోడ్డుమార్గంలో రెండువైపులా భూమిలోపల అండర్‌గ్రౌండ్, ఓవర్‌హెడ్ నిర్మాణాలు ఉన్నాయి. అక్కడ ఓ మతపరమైన కట్టడం కూడా ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని నేషనల్ హైవేస్ అధికారులు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు కింద రోడ్డు, దానిపైన మెట్రో రైలు పరుగులు తీసేవిధంగా వయడక్ట్(ట్రాక్) ఉండేవిధంగా డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించాలని రెండు సంస్థలు కలిసి ప్రతిపాదించాయి.

→ బీహెచ్ఈఎల్ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్‌కు ఎడమవైపున ఆర్టీసీ బస్టాప్ వద్ద మెట్రోస్టేషన్ నిర్మిస్తారు. దీంతో మెట్రో ప్రయాణికులు సిటీ బస్సుల్లోకి మారేందుకు ఈజీగా అవకాశం ఉంటుంది.

→ నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ మీదుగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు నిర్మించనున్న మెట్రో కారిడార్‌లో భాగంగా మైలార్‌దేవ్‌పల్లి నుంచి కొత్తగా నిర్మించనున్న హైకోర్టు వరకు 5 కిలోమీటర్ల మేర కారిడార్‌ను పొడిగించనున్న సంగతి తెలిసిందే. ఈ రూట్‌లో పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవేకు ఎడమవైపున

### మైలార్‌దేవ్‌పల్లి రూట్‌లో మార్పులు

ఆరాంఘర్ నుంచి మెట్రో అలైన్‌మెంట్ మొదట ప్రతిపాదించారు. ప్రస్తుతం దానిని ఆరాంఘర్ వైపు కాకుండా పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవేకు కుడివైపున ఉన్న అగ్రికల్చర్ వర్సిటీ వైపు మార్చాలని నిర్ణయించారు. పీవీఎన్ఆర్ హైవేకు, అగ్రికల్చర్ వర్సిటీ ఫ్లైఓవర్‌కు మధ్య నుంచి మెట్రో అలైన్‌మెంట్ వెళుతుంది.




### ఎల్‌బీనగర్–హయత్‌నగర్ రూట్‌లో స్టేషన్ల మార్పు

→ మెట్రో రెండోదశలో భాగంగా ఎల్‌బీనగర్ మెట్రోస్టేషన్ నుంచి హయత్‌నగర్ మధ్య 7 కిలోమీటర్ల వరకు నిర్మించనున్న మెట్రో కారిడార్‌లో కూడా స్వల్ప మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఈ మేరకు నేషనల్ హైవేస్, మెట్రోరైల్ అధికారుల సంయుక్త తనిఖీల్లో ప్రతిపాదించారు. ఈ కారిడార్‌లో రెండు జీహెచ్ఎంసీ ఫ్లైఓవర్‌లు ఉన్నాయి. ఎల్‌బీనగర్ నుంచి చింతల్‌కుంట వరకు సెంట్రల్ మీడియన్‌లోనే మెట్రో అలైన్‌మెంట్ ప్రతిపాదించారు. చింతల్‌కుంట నుంచి హయత్‌నగర్ వరకు మాత్రం రోడ్డు మధ్యలో కాకుండా ఎడమవైపు ఉన్న సర్వీస్ రోడ్డుకు మెట్రో అలైన్‌మెంట్ మార్చారు. ఈ మార్గంలో నేషనల్ హైవేస్ కొత్తగా నాలుగు ఫ్లైవర్ల నిర్మాణం చేపట్టిన దృష్ట్యా ఈ మేరకు అలైన్‌మెంట్‌లో మార్పులు చేసినట్టు అధికారులు తెలిపారు.



→ ఈ రూట్‌లో నిర్మించనున్న 6 మెట్రో స్టేషన్లను నేషనల్ హైవేకు రెండువైపులా సర్దుబాటు చేయాలని నిర్ణయించారు. ఈ మార్గంలో ప్రయాణికుల సీమ్‌లెస్ జర్నీకి అనుగుణంగా ఈ మార్పులు ఉంటాయని హైచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. రెండురోజుల పాటు కొనసాగిన ఈ సంయుక్త అధ్య యనంలో నేషనల్ హైవేస్ ఇన్‌చార్జ్ ఐ.గణపతిరెడ్డి, హెచ్ఏఎంఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ పి.ధర్మారెడ్డి, ఉన్నతాధికారులు బి.ఆనంద్‌మోహన్, వై.సాయపరెడ్డి, బీఎన్ రాజేశ్వర్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.